క్లుప్తంగా

పుష్కర ఘాట్ శుభ్రం



మురమళ్ల పుష్కర ఘాట్‌ను శుభ్రం చేస్తున్న కూలీలు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి వేకువ జామున తీసుకొని వచ్చే గోదావరి జలం కోసం స్థానికంగా ఉన్న పుష్కర ఘాట్‌ను శుభ్రపరుస్తున్న దేవాలయ అధికారులు. ప్రతి రోజు ఉదయం నెల రోజులపాటు గోదావరి జలాన్ని మేళతాళాలతో తీసుకొని వచ్చి స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తు ఉంటారు. ఇందు కోసం అపరిశుభ్రంగా ఉన్న పుష్కరఘాట్‌ను ఆదివారం సుమారు పది మంది కూలీలతో శుభ్రం చేయిస్తున్నారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

గౌతమి గోదావరికి ఎర్రనీరు



ఎరుపు రంగు సంతరించుకున్న యానాం వద్ద గౌతమి గోదావరి

యానాం: ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తుండడంతో యానాం వద్ద గౌతమి గోదావరి వరద నీటితో ఎర్రరంగును సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో రాజీవ్ రివర్ బీచ్ వద్ద గౌతమి గోదావరి వరద నీటి పరవళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వరద వస్తుండడంతో పోలీస్ యంత్రాంగం బందోబస్తు ఏర్పాటు చేశారు.

రసాయనాలు వద్దు.. కషాయాలే ముద్దు

అంబాజీపేట: పంటలను నాశనం చేస్తున్న పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రసాయనాల వినియోగానికి స్వస్తి చెప్పి కషాయాలను (అగ్నిఅస్త్రం) వినియోగిస్తే ఆరోగ్యానికి మంచిదని ప్రకృతి వ్యవసాయ ఎల్2 దుర్గాలక్ష్మి రైతులకు సూచించారు. ఇరుసుమండలో ప్రకృతి వ్యవసాయం, కషాయాల తయారీపై ఎంటీ జె.నాగమణి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పురుగుల నివారణకు కషాయాలను వినియోగిస్తే ఖర్చు ఆదా చేయడమే కాకుండా నాణ్యమైన పంట వస్తుందన్నారు. వేప ఆకులతో గోమూత్రం, పచ్చిమిర్చి, పొగాకు వెల్లుల్లితో కషాయాలను తయారు చేసుకోవాలన్నారు. ఎకరానికి ఒక పంట కాలవ్యవధికి 15 లీటర్ల అగ్నిఅస్త్రం సరిపోతుందన్నారు. 15 లీటర్ల గోమూత్రం, 5 కేజీల వేపాకు, కేజీ పచ్చిమిర్చి, కేజీ పొగాకు, అరకేజీ వెల్లుల్లిని వినియోగించుకోవాలన్నారు. వీటన్నింటిని సన్నటి మంటపై బాగా మరిగించాలన్నారు. చల్లారిన తరువాత వడపోసి 48 గంటల పాటు నిల్వ ఉంచాలన్నారు. ఈ అగ్నిఅస్త్రం మూడు నెలలు పాటు నిల్వ ఉంటుందన్నారు. కాండం తొలిచే పురుగుపై బాగా ప్రభావం చూపిస్తుందన్నారు. ఒక ఎకరానికి 100 నీటికి 3 నుంచి 5 లీటర్ల కషాయం కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. సీహెచ్ సత్యశ్యామల లక్ష్మి, ఎం.దుర్గాభవాని, ఎం.సత్యవాణి, డీవీఎస్.మణి, కె.మల్లేశ్వరి, జె.కనకలక్ష్మి పాల్గొన్నారు.

ఈ విధంగా విత్తన శుద్ధి చేయండి

మామిడికుదురు: ఈదరాడ, మాకనాలెం గ్రామంల్లో విత్తనశుద్ధిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడంపై రైతులకు సమగ్రంగా వివరించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల భూమి నుంచి, విత్తనం నుంచి వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. ఈ విధంగా విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం మెరుగ్గా ఉంటుందని, దిగుబడి శాతం పెరుగుతుందన్నారు. రైతులు నేల ప్రభుదాస్, నేల రమేష్ చేత విత్తనశుద్ధి చేయించారు.

ఆరోగ్య ప్రదాయిని జిప్‌మెర్

- కిడ్నీ రోగుల ఉచితంగా డయాలసిస్ ట్రీట్‌మెంట్
- ఇప్పటివరకు వందలాది మందికి సేవలు
- స్పెషలిస్ట్‌ల నియామకంతో అందనున్న పూర్తిస్థాయిలో వైద్యసేవలు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల కిడ్నీ రోగుల సైతం సద్వినియోగం
- చేసుకోవాలంటున్న వైద్యాధికారులు



డయాలసిస్ ట్రీట్‌మెంట్ పొందుతున్న కిడ్నీరోగులు

యానాం: కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న రోగులకు జిప్‌మెర్ వరంగా మారింది. ఈ ఆసుపత్రిలో కిడ్నీకి సంబంధించిన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) యానాం ఆసుపత్రిలో కిడ్నీరోగులకు డయాలిసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. డయాలిసిస్ కోసం వేలాది రూపాయలు కార్పొరేట్ ఆసుపత్రులకు ఖర్చు చేసే బదులు జిప్‌మెర్‌లో ఉన్న డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

డయాలసిస్ విభాగం ప్రారంభం

సుమారు రూ.కోటితో కేంద్ర ప్రభుత్వం జిప్‌మెర్‌లో డయాలిసిస్ విభాగాన్ని ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేశారు. స్థానికంగా కిడ్నీ వ్యాధుగ్రస్తులు ఎక్కువగా ఉండటంతోపాటు డయాలిస్ కోసం కాకినాడ తదితర దూరప్రాంతాలకు వెళుతున్నారు. ఎక్కువగా పేద వర్గాలైన రోగులు డయాలసిస్ కోసం దూర ప్రాంతానికి వెళ్లడంతోపాటు అనేక వ్యయ ప్రయాసలు పడుతున్నారు. దీంతో డయాలసిస్ విభాగాన్ని తప్పనిసరిగా ప్రారంభించాలని స్థానిక నాయకులు సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో త్వరితగతిన డయోలిస్ విభాగాన్ని ఒకేసారి ఐదుగురుకి చేసే విధంగా మెషీనరీలను ఏర్పాటు చేశారు. మరో పది మెషీన్లను కూడా వస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు పొందవచ్చన్నారు.

200 మందికి వైద్య సేవలు

ఈ ఏడాది మే 24వ తేదీన ప్రారంభించిన డయాలిస్ సేవలను సుమారు 200 మంది వరకు యానాం పరిసర ప్రాంతాల వారు వినియోగించుకున్నారని వైద్యాధికారులు తెలిపారు. ఉచితంగా సేవలు అందిచడంతో పాటు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన బాధలు తప్పాయని పలువురు రోగులు తెలిపారు.

రోగులు సద్వినియోగం చేసుకోవాలి

జిప్‌మెర్‌లో కిడ్నీ వ్యాధికి అందుతున్న వైద్యంతో పాటు డయాలిస్ సేవలు సైతం సద్వినియోగం చేసుకోవాలని జిప్‌మెర్ వైద్యులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ వైద్య సంస్థ అయిన జిప్‌మెర్ కేవలం యానాం కు మాత్రమే పరిమితమైంది కాదని ఏపీ వాసులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వాసులు సైతం ఉచితంగా సేవలు పొందవచ్చునని, దీనిని అందరూ అవగాహన చేసుకోవాలని వివిధ వ్యాధులకు నాణ్యమైన వైద్యాన్ని పొందవచ్చునన్నారు. ఏపీ హెల్త్ ట్రస్ట్‌తో సైతం జిప్‌మెర్ ఒప్పందానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

25 మంది స్పెషలిస్ట్ వైద్యులు

జనరల్ మెడిసిన్ వైద్యులు, జిప్‌మెర్‌లో మరిన్ని సేవలను అందించడానికి స్పెషలిస్ట్ వైద్యులను నియమించించారు. వారు త్వరలోనే విధులుకు హాజరవుతారని వైద్యాధికారులు తెలిపారు. అనస్తీషియా, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఒబిజీ, రేడియోడయోగ్నోసిస్, నెఫ్రాలజీ తదితర స్పెషలిస్టులు వస్తున్నారని వారి సేవలు సైతం అందుతాయన్నారు. ఆపరేషన్లు కూడా జరుగుతాయని తెలిపారు. స్పెషలిస్టులు రావడంతో జిప్‌మెర్ అవుట్‌పేషంట్ సేవలతో పాటు ఇన్‌పేషెంట్ సేవలు సైతం అందుబాటులోకి వస్తాయన్నారు.

అందరికీ అందుబాటులో..



యానాం జిప్‌మెర్‌లో కిడ్నీ రోగుల కోసం దయాలిస్ సేవలు ఉచితంగా అందుతున్నాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిప్‌మెర్ ఆసుపత్రి యానాంతో పాటు ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల వాసులు సైతం నాణ్యమైన వైద్యాన్ని పొందవచ్చు.

– డాక్టర్ ఆనంద్‌రాజ్,
చీఫ్ మెడికల్ ఆఫీసర్, జిప్‌మెర్, యానాం



అధునాతనమైన డయాలసిస్ మిషనరీ

రేబిస్ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గం



ఇంజరంలో పెంపుడు కుక్కకు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి దవులూరి సుధ

తాళ్లరేవు: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్ వ్యాధికి చికిత్స లేనందున నివారణకు ఒక్కటే మార్గమని, ఈ వ్యాధి నివారణపై అధికారులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్ అన్నారు. ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా ఇంజరం, పత్తిగొంది, తాళ్లరేవు, పటవల పశువైద్య కేంద్రాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా వ్యాక్సిన్‌లు వేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన రేబిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెంపుడు జంతువులకు తప్పకుండా యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. స్థానిక నాయకులు పశు వైద్యాధికారులు దవులూరి సుధ, ఎస్‌బీవీ రమణమూర్తి, శుభశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా గణపతి



దేవగుప్తంలో నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కార్యవర్గం



జిల్లా అధికార ప్రతినిధి గణపతిని అభినందిస్తున్న పార్లమెంటరీ ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్



శ్రీనుకు సత్కరిస్తున్న జెడ్పీటీసీ సంపదరావు, పార్టీ నాయకులు



జిల్లా ట్రెజరర్ గా శ్రీనివాసరావు



జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేశ్వరరావు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా సూదా గణపతి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గణపతి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతో పని చేశారు. మండల ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పార్టీ పటిష్టతకు కృషి చేశారు.

ట్రెజరర్‌గా శ్రీనివాసరావు

వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా ట్రెజరర్‌గా అమలాపురం మండలం బండారులంకకు చెందిన చేనేత సంఘం నాయకుడు కాలేపు నాగ శ్రీనివాసరావు నియమితులయ్యారు. గతంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా పని చేశారు.

ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగేశ్వరరావు

కోనసీమ జిల్లా వైసీపీ జిల్లా వైఎస్సార్ సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కామనగురువు గ్రామానికి చెందిన రాజులపూడి నాగేశ్వరరావు నియమితులయ్యారు. నాగేశ్వరరావు కామన గురువు వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీగా పనిచేశారు. తమకు ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అధ్యక్షుడు పార్టీఅధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్, అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి పినిపే డాక్టర్ శ్రీకాంత్‌లకు గణపతి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

దేవగుప్తం గ్రామ కమిటీ ఎన్నిక

అల్లవరం: వైఎస్సార్ సీపీ దేవగుప్తం అధ్యక్ష కార్యదర్శులుగా కుడుపూడి సూర్యప్రకాశరావు, పినమాల విక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పోతుమూడి శ్రీను (రోహిణీ శ్రీను), సంయుక్త కార్యదర్శిగా పల్లి జయ, కోశాధికారిగా చిట్టుమేను ఆనంద్ ఎన్నికైయ్యారు. నూతన గ్రామ కమిటీ కార్యవర్గాన్ని సర్పంచ్ సాధనాల వెంకటరావు అభినందించారు. అనంతరం పార్టీ విధేయుడుగా ఎన్నో సేవలు అందించిన గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీను, బొంతు సత్యనారాయణ, ఈతకోట సతీష్, కాశి బాలయోగి, చిట్టూరి వెంకటనారాయణ, నాగావరపు సత్యనారాయణ, రొక్కాల బాబ్జి, వినోద్, ప్రసాదు, జంగా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుకు సత్కారం

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమతులైన ఎస్.యానం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పొగాకు శ్రీనును ఆదివారం పలువురు పార్టీ నాయకులు ఆయన నివాసంలో కలిసి అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను, పార్టీ నాయకులు మోటూరి సత్యంకాపు, తాడి గోపాలకృష్ణ, రేవు రాజేష్, లంకే చిరంజీవి, ముత్తాబత్తుల సురేష్, సంగాని నరసింగరావు, మల్లాడి చంద్రశేఖర్, ముదే దుర్గబాబు, దంగేటి అయ్యప్ప, మట్టా నాని, పాము వెంకటేశ్వరరావు తదితరులు శ్రీనుకు దుశ్శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు.

ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రను వివరిస్తున్న సత్యనారాయణ

అమలాపురం టౌన్: మేరా యువ భారత్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ కళాశాలలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బీజేపీ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రను, ఆయన చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ముఖర్జీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీహెచ్ఎన్ కిషోర్, అధ్యాపకులు సూర్యనారాయణ, అరుణ, మై భారత్ వలంటీర్లు సరోజిని, ఈశ్వర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతికి తీవ్ర గాయలయ్యాయి. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొర్లపాటివారిపాలేనికి చెందిన మిండగుదిటి పవిత్ర ధనలక్ష్మి, ఆమె సోదరి మిండగుదిటి సాయిచంద్రలేఖ, సోదరుడు మిండగుదిటి సిద్ధి వినయ్ ఈ నెల 5న బైక్‌పై అమలాపురం వెళుతున్నారు. ఈ సమయంలో పేర్మాయిపాలెం రోడ్డు నుంచి మోటారు సైకిలిస్టు అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఆ ముగ్గురు వెళ్లే బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దాంతో పవిత్ర ధనలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా, సాయిచంద్రలేఖ, సిద్ధి వినయ్‌లకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలతో ఉన్న పవిత్ర ధనలక్ష్మిని అమలాపురం కిమ్స్‌కు తరలించగా మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు సిద్ధివినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉల్లాసంగా రాష్ట్ర స్థాయి యోగా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు, యోగా గురువు శ్రీనివాస్



యోగా పోటీల్లో ఆసనాలు వేస్తున్న యోగార్థులు

అన్ని వయస్సుల వారు 200 మంది హాజరు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమం, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ఉల్లాసంగా ఆదివారం జరిగాయి. పదేళ్ల వయస్సు నుంచి 80 ఏళ్ల వయస్సు వరకూ అన్ని వయస్సుల వారు ఈ పోటీల్లో పాల్గొని యోగాసనాలతో సత్తా చాటారు. దాదాపు 200 మంది యోగార్థులు పోటీల్లో పాల్గొన్నారు. శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. అంతర్జాతీయ యోగా న్యాయ నిర్ణేత (జడ్జి) కేఎస్‌వీ శ్రీధర్ సాంకేతిక సహకారంతో పోటీలను నిర్వహించారు. ఎ.కాత్యాయిని, పి.చిరంజీవి,కె,తనుశ్రీ, ఈ.ప్రవీణ్, ఎ.ఉషశ్రీ, డి.వెంకటేశ్వర్లు, ఇంజమూరి మాధవరావు విజేతలుగా నిలిచారు. విజేతలకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్డీఎస్ ప్రసాద్, రోటరీ ప్రతినిధులు వరదా మల్లేశ్వరరావు తదితరులు సర్టిఫికెట్లు, పతకాలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు.

మట్టి తరలించుకుపోతున్న తమ్ముళ్లు



సత్తమ్మ చెట్టు వద్ద మట్టిని తరలించుకుపోతున్న దళారులు

- మట్టి అక్రమ రవాణాకు అండగా ఇరిగేషన్ అధికారులు

కాట్రేనికోన: పల్లంకుర్రు పంటకాలువ లాకు నంబరు–2 సత్తమ్మ చెట్టు వద్ద ఆధునీకరణ పనులు పేరుతో తవ్విన మట్టిని పాతశాల ఆటస్థలం మెరక పేరుతో తమ్ముళ్లు తరలించుకుపోతున్నారు. ఇటీవల బొబ్బర్లంక–పల్లంకుర్రు పంట కాలువకు సత్తమ్మ చెట్టు వద్ద రక్షణ వాల్స్, లాక్ ఆధునీకరణ పనులు పేరుతో తవ్విన మట్టి కాలువకు ఇరువైపులా గట్టుపై వేశారు. మట్టిపై కన్నేసిన తమ్ముళ్లు కాలువ గట్టుకు ఇరువైపులా వేసిన మట్టిని తరలించుపోతున్నారు. గోదావరి రక్షణ గట్టు వైపు వేసిన మట్టిని తరలించడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నా లెక్క చేయడం లేదు. కాలువలో తవ్విన మట్టిని రక్షణ గట్టుకు పంట కాలువ వైపు బలపరచడంతో వరదల నుంచి రక్షణగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పాఠశాల ఆటస్థలం పేరుతో తరలించుకుపోతున్న మట్టి అక్రమంగా అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇరిగేషన్ ఏఈఈ పవన్ కుమార్‌ను వివరణ కోరగా మట్టిని కందికుప్ప, అడవిపేట పరిసర ప్రాంతాలకు తరలిపోతుండగా మట్టిని కుండలేశ్వరం లాకుల వద్ద ఇరిగేషన్ పనులకు పట్టుకుని వెళుతున్నామనే తప్పుడు సమాచారం చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడం, చేతివాటంతోనే దళారులు మట్టి తరలించుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



తాళ్లరేవు వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



చింతలమెరకలో శాకంబరి దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

తాళ్లరేవు: పవిత్ర తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. తెల్లవారుజాము నుంచి మండలంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రధానంగా తాళ్లరేవు కేశవపురంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి ఆలయం, ప్రధాన రహదారిలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయం, జార్జిపేట, పి.మల్లవరం, పిల్లంక, జి.వేమవరం, కోరంగి, ఇంజరం తదితర గ్రామాలలోని విష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా తాళ్లరేవు భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణాన్ని అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు బృందం ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన విజయ దుర్గాదేవి

కాట్రేనికోన: చింతలమెరక గ్రామంలో ఉన్న విజయ దుర్గాదేవి అమ్మ శాకంబరి అలంకరణలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలో పార్వతీ సమేత కుండలేశ్వరుడు, నడవపల్లిలో రామలింగేశ్వరుడు, కాట్రేనికోనలో కనికేశ్వరుడు, చింతల మెరకలో శ్రీవిజయ దుర్గాదేవి, గచ్చకాయలపోరలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి, పల్లంకుర్రులో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. విజయ దుర్గాదేవి ఆలయ అర్చకులు ఆకొండి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మను దర్శించుకున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి భారత మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గడియారం స్తంభం సెంటరులో మాదిగల పొలిటికల్ జేఏసీ, ఎంఈఎఫ్, బాబూ జగ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వర్ధంతి సభలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడారు. తొలుత బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో పాటు మాదిగ ఎంప్లాయిస్ నాయకులు, పొలిటికల్ జేఏసీ ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ అసోసియేషన్, పొలిటికల్ జేఏసీ ప్రతినిధులు మడికి శ్రీరాములు, నవండ్రు లక్ష్మణరావు, మడికి సత్యనారాయణ, యార్లగడ్డ రవీంద్ర, లంక అర్జునరావు, ఉందుర్తి సతీష్, నవుండ్రు వాడపల్లి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

అల్లవరం: భారత మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఘన నివాళులర్పించారు. గోడిలోని ఆయన నివాసంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభివృద్ధికి కోసం కృషి చేశారని, ఆయన సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మి ఆనందరావు, బొమ్మి చంటి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

యానాం: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆదివారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక భీమనగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ మున్సిపల్ కమిషనర్ అఖిల్, సీఐ అదలరాసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.